రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం

- రైతులపై ఇన్సూరెన్స్ ప్రీమియం భారం
- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు



సింహాద్రిపురంలో సాగు చేసిన వేరుశనగ పంట

సింహాద్రిపురం : అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వాగ్దానం చేసిన కూటమి సర్కార్ ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా.. రైతులపై అదనంగా ఇన్సూరెన్స్ ప్రీమియం భారం మోపేందుకు సిద్ధమైంది. అలాగే రైతులపై జీఎస్టీ మోపడంతో కూటమి సర్కార్‌పై రైతులు మండిపడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రైతుల తరఫున ప్రీమియం చెల్లించి ఆదుకుంది. దీనికితోడు పెట్టుబడిసాయం కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 జమచేస్తూ వచ్చింది. ఇటీవల కూటమి సర్కార్ రాష్ట్రంలో కొలువుదీరడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు రూ.20వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా దాని గురించి ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్‌సాగుకు రెండు నెలల ముందే కూటమి సర్కారు కొలువుదీరడంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని, పంటల సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. కనీసం రబీ సీజన్ సమయానికైనా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా చేశారు. ప్రతి ఏటా పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరగడం, మరో వైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు దిగుబడులు సరిగా రాకపోవడం వంటి కారణాలతో రైతులు నష్టాలు పాలవుతున్నారు. దీంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరమై ఇతర రంగాల్లో పనులు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ప్రత్యామ్నాయం లేకపోవడంతో కష్టమైనా, నష్టమైనా పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

రైతులకు గుదిబండగా మారిన ప్రీమియం

ప్రస్తుతం రైతులు అప్పులు చేసి పంటలను సాగు చేసుకున్నారు. పంటలు సాగు కోసం రైతన్నలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులకు ఇది గుదిబండగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం డిసెంబర్ 15 తుదిగడువు విధించింది. రుణాలు రెన్యువల్ చేసుకుంటే తప్ప ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు తెగేసి చెబుతుండటంతో.. రుణాల చెల్లింపు రైతులకు తలకు మించిన భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేపట్టిన తాము ఇప్పుడు రుణాలను రెన్యువల్ ఎలా చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం చెల్లింపు అదనపు భారం



గత ఐదేళ్లుగా పంటల సాగుకు ముందు పెట్టుబడి సాయం అందుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం కొలువయ్యాక ఆ సహాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి పంటల సాగు చేపట్టాం. ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించగా, కూటమి ప్రభుత్వం రైతులనే కట్టమంటుంది. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మరింది.

– మహేశ్వర్‌రెడ్డి, రైతు, సింహాద్రిపురం.

రైతులపై జీఎస్టీ మోత



క్రిమి సంహారక మందులపై 18 శాతం, యంత్ర పరికరాలపై 12 నుంచి 18 శాతం జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎరువులపై 5 శాతం పన్ను విధిస్తోంది. విత్తనాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. పురుగు మందుల లావాదేవీలు సీజన్‌కు కోట్లాది రూపాయలు జరుగుతుంటాయి. రైతులు వ్యవసాయ యంత్ర పరికరాలు అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తుంటారు. వీటిపై కేంద్రం అధిక శాతం జీఎస్టీ విధించడంతో రైతులపై పెను భారం పడుతోంది.

– కళ్యాణ్‌రెడ్డి, రైతు, సింహాద్రిపురం.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ

వేముల : మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని యూసీఐఎల్ డీజీఎంఎస్ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టుపై బ్లా స్టింగ్ ప్రక్రియ, ఎక్స్‌ప్లోసివ్ నిల్వ, రవాణాకు సంబంధించి తగిన సూచనలు, సలహాలు, జా గ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో యూసీఐఎల్ జీఎం.సుమన్ సర్కార్, ఎజెంట్ కిశోర్ భగవత్, మైనింగ్ మేనేజర్ భగవత్ శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, బ్లాస్టింగ్ ఇన్‌చార్జిలు భద్రదాస్, ఎన్.వి.రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు, ఫోర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టండి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : పగటి పూట వీధిలైట్లు వెలగకుండా చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ వృథాను అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని చిన్నకాంపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు రిమ్స్ సెక్షన్ పరిధిలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లను , విద్యుత్ లైన్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం తెలుగు గంగ సెక్షన్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. వినియోగదారులతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించడం ద్వారా సంతృప్తికర స్థాయిని పెంచాలన్నారు. ప్రతి ఉద్యోగి ఫీల్డ్‌లో తిరిగి పనిచేయడం ద్వారా విద్యుత్ అంతరాయాలను అరికట్టి నిరంతర విద్యుత్ అందించాలన్నారు. లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తక్కువ ఎత్తులో వున్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగుచర్యలను తీసుకోవా లని అదేశించారు. ఈఈ హరి నాయక్, డీఈఈ రామచంద్రారెడ్డి, ఏఈ రమణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

వేముల : జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్–17 బాలికల విభాగంలో వేముల మండలం వి.కొత్తపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అంజలి ఎంపికైనట్లు హెడ్మాస్టర్ నరసింహరావు తెలిపారు. ఈనెల 9, 10, 11వ తేదీలలో గుంటూరు జిల్లాలో జరిగిన అండర్–17 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలలో అంజలి విశేష ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 7వ తేదీవరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని ఆయన తెలిపారు.

ఆయుర్వేద మెడిసిన్‌పై అవగాహన

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, నిత్యము ఆచరించవలసిన పనుల ను గురించి వివరించారు. వైస్ ప్రిన్సి పాల్ నాగేంద్ర మాట్లాడుతూ ఆచరించవలసిన హె ల్త్ డైట్ గురించి విద్యార్థులకు వివరించారు. ఎంఐ లైఫ్ స్టైల్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ కోఆర్డినేటర్ సాయికీర్తన, జిల్లా కో ఆర్డినేటర్ పి.విశ్వనాథ్, ఎంఐ మార్కెటింగ్ కో ఆర్డినేటర్ పి.సుజాతలు పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : లబ్ధిదారులు ప క్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేసి వీలై నం త్వరగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శా ఖ పీడీ రాజారత్నం తెలిపారు. చింతకొమ్మది న్నె మండల పరిధిలోని తాడిగొట్ల జగనన్న కా లనీ లే అవుట్‌లోని పక్కాగృహ నిర్మాణ పనుల ను బుధవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్ణీత గడువు లోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. డీఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈ శ్రీ నివాసులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

జమ్మలమడుగు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టాల్లో ఉన్న చేనేతలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం

–వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత సాయినాథ శర్మ ధ్వజం

కమలాపురం : బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర శాసన సభ్యులకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం ఇక రాష్ట్రాన్ని ఏలా పాలిస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కాశీభట్ల సాయినాథ శర్మ ప్రభుత్వ పనితీరు పట్ల ధ్వజమెత్తారు. బుధవారం ఆయన స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సోమవారం అసెంబ్లీకి హాజరైన ఎమ్మెల్యేలు తమకు భోజనం సరిగా పెట్టడంలేదని, తాము అసెంబ్లీలో తినే భోజనం ఏ మాత్రం రుచిగా లేదని, సరైన భోజనం లేక తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు ఫిర్యాదు చేయడం సుధీర్ఘ పరిపాలన అనుభం అని చెప్పుకునే ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేల భోజనం విషయంలో చివరకు స్పీకర్ ద్వారా మంచి భోజనం కోసం సిఫార్సు చేసుకునే పరిస్థితికి కూటమి ప్రభుత్వ పాలకులు దిగజారడం శోచనీయం అన్నారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కోట్ల రుపాయలు నిధులు వెచ్చిస్తున్నప్పటికి కనీసం ఎమ్మెల్యేలకు మంచి భోజనం పెట్టక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కక్ష పూరిత వాతావరణం సృష్టించడానికి శ్రద్ధ పెడుతున్న పాలకులు ఎమ్మెల్యేలకు మంచి భోజనం పెట్టడంలో శ్రద్ధ తీసుకోక పోవడం ఎమ్మెల్యేలను అవమానపరచి నట్లేనన్నారు. వైఎస్సార్ సీపీ గత ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా తమకు భోజనం బాగోలేదని ఫిర్యాదు చేయలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలకు అన్ని వసతులు సమకూర్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేలకు మంచి భోజనం పెట్టలేని ఈ ప్రభుత్వం ఇక సూపర్ సిక్స్ అమలు చేస్తుందా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వ్యతిరేక పోస్టులపై చర్యల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన అధికార పక్షం రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం విచారకరమన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి కూటమి పాలకులు కృషి చేయాలని ఆయన సూచించారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎంపీ



కల్యాణ మండప ప్రారంభోత్సవంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల సమీపంలో గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.1.50కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన గురుకుంట కల్యాణ మండపాన్ని బుధవారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శివపార్వతుల కల్యాణ దీపాన్ని వెలిగించారు. ఎంపీని ఆలయ అర్చకులు రాజాశర్మ, పురోహితుల బృందం సత్కరించారు. దేవాలయాల సముదాయాలకు, ప్రహరీ గోడకు, ఆలయ అభివృద్ధికి మీ సహకారం మరువలేనిదని ఎంపీ మహిళలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రామశేఖర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, శ్యాంసుందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు ప్రారంభం

నూతనంగా ఏర్పాటు చేసిన ముక్కంటి ఫర్టిలైజర్ షాపును బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎరువులను కొనుగోలు చేసి మొదటి బిల్లును చెల్లించారు. రైతులందరికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పిచికారి మందులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమస్యలపై కలెక్టర్‌కు వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలపై బుధవారం పులివెందుల పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం పాడాను రద్దు చేయడంతో పులివెందుల మున్సిపాలిటీలో వాటర్ గ్రిడ్ పనులు నిలిచిపోయాయని, అలాగే రోడ్లు, కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు విన్న కలెక్టర్ పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, ఖాదర్‌బాషా, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీబీసీ కాలువకు నీరు విడుదల చేస్తాం



పీబీసీ ఈఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

వేంపల్లె : పులివెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా మండలంలోని పాములూరు, కత్తులూరు, అయ్యవారిపల్లి, అమ్మగారిపల్లి గ్రామాలకు రెండు రోజుల్లో సాగు, తాగు నీరును విడుదల చేస్తామని పీబీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద రైతులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. నీటి లభ్యత తగ్గి బోర్లు ఇంకిపోయాయని, దీంతో పంటలు దెబ్బతిని నష్టపోయే పరిస్థితి నెలకొని ఉందని రైతులు ఇంజనీరింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పీబీసీ నుంచి కొత్తపల్లి చెరువుకు, అక్కడి నుంచి కత్తులూరు, అమ్మగారిపల్లి కాలువకు నీరు విడుదల చేస్తామని రైతులకు హామీనిచ్చారు. వర్షపాతం తక్కువగా ఉందని, నీరు విడుదల ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు శాతం పెరుగుతుందని ఇంజనీర్ అధికారి వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియాసిస్‌పై ఇంటింటి సర్వే

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి లోని చిన్నకుడాల గ్రామంలో బుధవారం ఫైలేరి యాసిస్ వ్యాధిపై ఇంటంటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీ సర్ సిద్ధయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి బోధ వ్యా ధికి సంబంధించి రక్త పూతల సేకరణ చేస్తామన్నా రు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

వేంపల్లె : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. బుధవారం సాయంత్రం పులివెందుల నుంచి కడప రోడ్డు వైపు వెళుతున్న తుఫాన్ వాహనం వేంపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు రాగానే డ్రైవర్ నరసింహారెడ్డికి మూర్ఛ వచ్చింది. దీంతో రోడ్డుపై నిలిపిన మోటార్ బైకును ఢీకొట్టి కొద్ది దూరం వెళ్లి వాహనం నిలిచిపోయింది. ఈ సమయంలో మోటార్ బైకు వద్ద గాని రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. అయితే వాహనం నిలిచిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వాహనంలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపువాసులకు పరిహారం చెల్లించాలి

జమ్మలమడుగు : గండికోట ముంపువాసులకు ఇవ్వవలసిన పరిహారం వెంటనే ఇవ్వాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన శాసనమండలి సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వం ముంపువాసులకు పరిహారం రూ.10 పది లక్షల ప్రకటించి 8 గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడం జరిగింది. అయితే మొదటి విడత కింద ఉన్న 14 గ్రామాలలో ఉన్న 9 వేలకు పైగా ఉన్న లబ్ధిదారులకు ఒక్కొకరికి ఇంకా రూ.3.25 లక్షల పరిహారం అందించవలసి ఉంది. పెద్దముడియం మండలం కుందూ నదిపై రాజోళి రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టి అవార్డు కూడా ప్రకటించారు. ప్రభుత్వం రూ.12 లక్షలకుపైగా పరిహారం ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, లోకేష్‌లు కూడా కడప జిల్లా పర్యటన సందర్భంగా రాజోళి ఆనకట్ట బాధితులతో పరిహారం పెంచి ఇస్తామని ప్రకటించారు.

విద్యార్థి అదృశ్యం



శ్రీకాంత్ (ఫైల్)

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామానికి చెందిన విద్యార్థి దాసరి శ్రీకాంత్ (14) అదృశ్యమైనట్లు ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపారు. తిప్పలూరు గ్రామానికి చెందిన వేణుగోపాల్ కుమారుడు దాసరి శ్రీకాంత్ కడపలోని రిమ్స్ రోడ్డులో ఉన్న శ్రీ చై తన్య స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ నెల 2వ తేదీన స్కూల్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. అయితే స్కూల్‌కు చేరలేదు. చుట్టుపక్కల విచారణ చేపట్టిన తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100530 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు

విజయవంతం చేయండి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు చింతకొమ్మదిన్నె గ్రంథాలయంలో జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖన పోటీలతో పాటు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఇబ్రహీం తెలిపారు. ఆసక్తి వున్న విద్యార్థులు తమ పేర్లను స్థానిక గ్రంథాలయంలో నమోదు చేసుకోవాలరు.

రేపు చర్మవ్యాధుల వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రికి శుక్రవారం చర్మవ్యాధుల వైద్య నిపుణులు వస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. ఈ సందర్భంగా చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెడలు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. వివరాలకు 9963170177, 085686189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె : మండలంలోని కత్తులూరు పంచాయతీ తాటిమాకులపల్లి గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకగా జరిగింది. బుధవారం ఉదయం 10 గంటలకు స్వామివారి విగ్రహాల ప్రాణ ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పులివెందుల అభివృద్ధి సంస్థ పాడా ద్వారా ఆలయ కాంపౌండ్‌కు రూ.9 లక్షలు మంజూరు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.